# ప్రేమసరీ నోటు

— ఉపద్రష్ట శాయి

**ఇంకా చీకటి పడలేదు.** నీలిరంగు ఆకాశం సముద్రం మీదికి దిగుతున్నట్టు కనిపిస్తూంది. ఉవ్వెత్తున లేచి పడుతున్న కెరటాలు జరజరా పాకుతూ వచ్చి కాళ్ళను చుట్టేసినప్పుడు ఒళ్ళు జలదరిస్తోంది. ఒక రకమైన గిలిగింత కలుగుతూంది. సుధీర్ చేతిని గట్టిగా పట్టుకుని నిలబడింది కాంతి. అలల తాకిడికి తడిసిన నైలెక్స్ చీరెను మోకాళ్ళదాకా పైకెత్తి పట్టుకోవడంతో పాలరాతి రంగులో అరటి బోదెల్లా మిలమిలా మెరిసిపోతున్నాయి కాంతి కాళ్ళు. వీస్తున్న గాలికి పైటకొంగు పైకి లేవడంతో బింకం నిండిన కాంతి అవయవ సౌందర్యం సుధీర్ వయసుతో సవాలు చేస్తూంది. దానికి తోడు సుధీర్ అరచెయ్యి కాంతి అరచేతిలో అల్లరి పెడుతూంది.

అటు చల్లగాలి — ఇటు సంధ్య చీకటి. బీచ్‌లో ప్రేమికులు ప్రేమసరీ నోటు రాసుకుంటున్నారు.

తడిసిన ప్యాంట్‌ను మోకాలిదాకా మడుచుకుంటున్న సుధీర్‌ని చూసి పులకరించిపోయింది కాంతి. అతను అందగాడు కాదు. కానీ మగవాడు. ఒక వయసులో ఆడదైనా, మగవాడైనా అందాన్ని కోరు కోరు... కాంతి కళ్ళు సుధీర్ కళ్ళతో కలిసాయి. ఆమె చేతులు అతని చేతులతో పెనవేసుకుపోయాయి.

అలా అరగంట గడిచింది—

రెండు ఐస్‌క్రీములు కరిగిపోయాయి.

గాలి రెపరెపలకు పైటకొంగు సుధీర్‌ను చుట్టేసింది.

మరికొంతసేపటికి మోటర్ సైకిలు దూసుకుపోయింది — వచ్చే వారం కలుద్దామని వాగ్దానం చేసుకున్నారు.

* * *

సుధీర్ అందగాడు కాదు. ధనవంతుడు కాదు. పెద్ద ఉద్యోగంలో లేడు. స్నేహితుడి మోటర్ సైకిల్ అప్పుగా తీసుకుని మళ్ళీ తిరిగి ఇచ్చేసేవాడు. కానీ ఎందుకో కాంతి అతన్ని ఇష్టపడింది. పలకరింపులతో మొదలైన స్నేహం చెట్టాపట్టాలేసుకుని తిరిగే లెవెల్‌కు పెరిగింది. తన స్నేహితులు కొందరు కాంతితో "అతనిలో ఏముందని అతన్ని లైక్ చేస్తున్నావ్" అని అడిగారు.

"నన్నిష్టపడే మగవాడిని నేనిష్టపడుతున్నాను... నన్ను కావాలనుకున్న వ్యక్తిని నేను కావాలనుకున్నాను" అంది కాంతి.

మరో వారం తిరిగింది. మళ్ళీ ఆదివారం. బీచ్‌లో పడవ చాటున కూర్చుని సుధీర్ కోసం ఎదురు చూస్తూంది కాంతి. ఇంతలో తన పడవకు మరో వైపు నుంచి వినిపించిన స్వరం అలవాటైన స్వరంగా అనిపించడంతో కాస్త శ్రద్ధగా వినింది కాంతి. సుధీర్ ఎవరితోనో మాట్లాడుతున్నాడు.

"నిజంరా! నేను కాంతిని నిజంగా ప్రేమిస్తున్నాను. ఎందుకో తెలుసా? కాంతి అందగత్తె. చదువుకుంది — ఐశ్వర్యవంతురాలు. నా పక్కన కాంతి నడిస్తే నా గౌరవం పెరుగుతుంది. నాకు లేని వాటిని భర్తీ చేయడానికి కాంతిలాంటి భార్య నాకు అవసరం..." అన్నాడు సుధీర్.

"ప్చ్! నీ ఇష్టం... తను నిన్ను ప్రేమిస్తుంది కదా. అయితే సరి... మరి నే వస్తా" అంటూ ఒక వ్యక్తి విసవిస వెళ్ళిపోతున్నాడు. అది గమనించిన కాంతి మెల్లగా పడవకు అటువైపు నుంచి లేచి సుధీర్ దగ్గరికి వచ్చింది.

కాంతిని చూసిన సుధీర్ పరవశించిపోయాడు.

"ఎందుకింత లేటు కాంతీ? అరె ఎందుకో డల్‌గా వున్నావ్..." అడిగాడు సుధీర్.

"అబ్బే ఐయామ్ ఆల్ రైట్... కాకపోతే..." నసిగింది కాంతి.

"కాకపోతే..." అడిగాడు సుధీర్.

"ఇదే మన ఆఖరి మీటింగ్" అంది కాంతి.

ఎదురుచూడని ఈ పరిణామానికి షాక్ ఫీలవుతూ "కాంతీ... ఏమిటిది... ఏమైందని..." అడిగాడు సుధీర్.

అతన్ని ఓదారుస్తూ చెప్పింది కాంతి —

"నీ కన్నా అందమైన, నీ కన్నా బాగా చదువుకున్న, నీ కన్నా డబ్బు గల ఒక వ్యక్తిని ప్రేమించాలనుకున్నాను. ఎందుకో తెలుసా? అతను నా భర్త అని నేనంటే నలుగురూ నన్ను చూసి గర్వపడాలి. అతను నా కన్నా గొప్పవాడైతే, నా కన్నా ఎక్కువ చదువుకున్నవాడైతే నా గౌరవం పెరుగుతుంది. అందుకే నాతో సరితూగే మగవాడిని నే వెతుక్కుందామని..." అంటున్న కాంతి మాటలకు నిశ్చేష్టుడైపోయాడు సుధీర్.

అంటే ఇందాక తను నిరంజన్‌తో ఆడిన మాటలు విన్నదన్నమాట కాంతి... అనుకున్నాడు సుధీర్.

"అది కాదు కాంతీ! నువు అపార్థం చేసుకున్నావు. ప్లీజ్ విను..."అంటూ కాంతిని సముదాయించబోతున్న సుధీర్‌తో—

"ఏ ప్రేమైనా కోరేది ఒక్కటే... పరస్పర అవగాహన. మనసుల కలయిక. ప్రేమ నలుగురి కోసం కాదు. మన కోసం. నీ భార్య నువు సంపాదించుకున్న షోకేసు బొమ్మ కాకూడదు. నలుగురూ మెచ్చుకోవాలని చిత్రకారుడు గీచే బొమ్మ అంతకన్నా కాకూడదు. ఎప్పుడైతే ఆ భావన నీలో కలిగిందో అప్పుడే నా ప్రేమసరీ నోటు చినిగిపోయింది. గుడ్ బై..." అంటూ విసవిస నడిచిపోయింది కాంతి. కెరటాలు లేచి లేచి పడుతున్నాయి — హోరు మాత్రం మిగిలింది.

